శిథిలావస్థలో కట్టుకాల్వ

- 65శాతం మాత్రమే పూర్తయిన మరమ్మతు పనులు
- కాల్వల్లో పేరుకుపోయిన పూడిక
- ప్రతీఏటా నీళ్లు అందక ఎండిపోతున్న పంటలు

గార్ల: నిజాం కాలంలో నిర్మించిన కట్టుకాల్వ ఆనకట్ట శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రతీ ఏటా ఆయకట్టు చివరి భూములకు నీళ్లందక పంటలు ఎండిపోతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గార్ల మండలం ముల్కనూరు పంచాయతీ గుంపెళ్లగూడెం సమీపంలో బయ్యారం పెద్దచెరువు అలుగునీరు వృథాగా పోకుండా నిజాం కాలంలో గుంపెళ్లగూడెం సమీపంలో కట్టు కాల్వపై ఆనకట్ట నిర్మించారు. కాల్వ కింద సుమారు 1000ఎకరాల ఆయకట్టు ఉంది. కాల్వలు శిథిలావస్థకు చేరుకోవడంతో 2017 సంవత్సరంలో ఆర్ఆర్ఆర్ పథకం ద్వారా కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతో రూ.2.39కోట్ల నిధులు మంజూరు కాగా, నాటి ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. కట్టుకాల్వ కాంట్రాక్టర్ ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ హైదరాబాదు వారు కేవలం 25శాతం పనులు చేపట్టి బిల్లులు చేసుకొని వెళ్లియారు. అనంతరం 2023 సంవత్సరంలో ఇరిగేషన్‌శాఖ మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంతో కాంట్రాక్టర్ సైతం 40శాతం మేర పనులు చేపట్టి వెళ్లిపోయాడు. నాటి నుంచి నేటి వరకు కట్టుకాల్వ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో కాల్వ ఆనకట్టకు, పంట కాల్వకు గండ్లు పడి ఆయకట్టు చివరి భూములకు నీళ్లు అందక ప్రతీఏటా వరిపంట చేతికొచ్చే దశలో ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.


ముల్కనూరు సమీపంలో శిథిలమైన కట్టుకాల్వ ఆనకట్ట


కాల్వలో పెరిగిన పిచ్చిమొక్కలు

మరమ్మతులు చేపట్టాలి



కట్టుకాల్వ ఆనకట్ట లీక్ అవుతుండడం, కాల్వల్లో చెత్తాచెదారం, పూడిక పేరుకుపోవడంతో ప్రతీ ఏటా ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ఆనకట్ట మరమ్మతు పనులు సత్వరమే పూర్తి చేయాలి. ఆయకట్టు చివరి భూములకు సైతం సాగు నీరు అందేలా చర్యలు చేపట్టి పంటలను కాపాడాలి.

- ఎద్దు భానుప్రకాష్, రైతు

ఇట్టి విషయంపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, రైతులు ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఇరిగేషన్ అధికారులు స్పందించి మిగిలిపోయిన 35శాతం కట్టుకాల్వ మరమ్మతు పనులు చేయించి పంటలు ఎండిపోకుండా చూడాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంపై ఇరిగేషన్ ఏఈ వంశీని 'సాక్షి' వివరణ కోరగా కట్టుకాల్వ ఆనకట్ట మరమ్మతు పనులు చేసిన మేరకే బిల్లుల చెల్లింపు జరిగిందన్నారు. మిగిలిన పనులకు ప్రభుత్వానికి కొత్తగా ప్రతిపాదనలు పంపానని, నిధులు మంజూరు కాగానే పనులు పూర్తిచేస్తాం అన్నారు.

క్లుప్తంగా

జూనియర్ అసిస్టెంట్‌కు గ్రూప్-2 ర్యాంకు



మరిపెడ రూరల్: ఇటీవల వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో మరిపెడ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అజ్మీర శ్రీకాంత్ 553వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం మరిపెడ తహసీల్దార్ సైదులు శ్రీకాంత్‌ను శాలువాతో సత్కరించాడు.

ఫార్మసీ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపిక



చిన్నగూడూరు: తెలంగాణ పాలిటెక్నిక్ లెక్చరర్స్ ఫార్మసీలో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన పల్లేరుల ప్రణీత స్టేట్ మొదటి ర్యాంకు సాధించి ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. మంగళవారం రవీంద్రభారతిలో ప్రజాప్రభుత్వంలో కొలువుల పండుగ జరిగింది. వరంగల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీలో ఫార్మసీ లెక్చరర్ ఉద్యోగ నియామక పత్రాన్ని టెక్నికల్ బోర్డ్ కమిషనర్ దేవసేన, ఎస్‌బీటీఈటీ సెక్రటరీ పుల్లయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

పంచాయతీ సెక్రటరీకి జేఎల్ కొలువు



చిన్నగూడూరు: జూనియర్ లెక్చరర్స్ ఉద్యోగ నియామకాల్లో మండలంలోని పగిడిపల్లి పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న పిండిగ శ్రీనివాస్‌కు జేఎల్ ఆంగ్ల అధ్యాపకుడిగా కొలువు వరించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన



తొర్రూరు: తొర్రూరు మువ్వా డ్యాన్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు యాదాద్రి జిల్లా స్వర్ణగిరి ఆలయంలో తాజాగా నిర్వహించిన ఆధ్యాత్మిక వేడుకల్లో నృత్యాలతో ఆకట్టుకున్నారు. శ్రీరాగ రమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆలయంలో నిర్వహించిన క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొర్రూరు విద్యార్థులు పేరిణి నృత్యం ప్రదర్శించి అలరించారు. ఉత్తమ ప్రదర్శనగా పరిగణించిన నిర్వాహకులు నృత్య శిక్షకులు రాజేందర్, చిన్నారులకు దేవతామూర్తుల జ్ఞాపికలు అందించి సత్కరించారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



గార్ల: మండలం లోని బుద్దారం పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షల వ్యయంతో నిర్మించే 3సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు బుధవారం పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కట్టా శ్రీనివాసరావు, కందునూరి శ్రీనివాసరావు, మోతీలాల్, పి.కిషన్, నంద్యా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



డోర్నకల్: మండలంలోని చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జి.సరస్వతి, కె.తన్విక, పి.ఆదర్శ్ వరంగల్ జిల్లా ఉమ్మడి జట్టు నుంచి ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈనెల 14 నుండి 16 వరకు వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణభాను, పీడీ గోవర్ధన్ అభినందించారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి

- వరంగల్, ఖమ్మం, కరీంనగర్ రీజియన్‌ల లాజిస్టిక్స్ మేనేజర్ రామారావు

కేసముద్రం/గార్ల: మున్సిపాలిటీ కేంద్రంలో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ బ్రాంచ్(కార్గో సర్వీస్)ను బుధవారం వరంగల్, ఖమ్మం, కరీంనగర్ రీజియన్‌ల లాజిస్టిక్స్ మేనేజర్ రామారావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్గో ద్వారా తక్కువ ధరకే కొరియర్ సర్వీస్ లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ రామయ్య, వేలాద్రి, నరేందర్, శివకుమార్, నాయకులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గుండా వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరావు, హతీరాం, బండ్ల అప్పిరెడ్డి, లాయర్ విశ్వ, తదితరులు పాల్గొన్నారు.


గార్ల: కార్గో సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామారావు

మేనేజర్‌కు వినతి..

మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి గార్ల మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం మేనేజర్ రామారావుకు అఖిలపక్ష నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో గార్లకు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

గార్ల: కేంద్ర, రాష్ట్ర పాలకులు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టివేశారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వరరావు ఆరోపించారు. బుధవారం మండలంలోని మద్దివంచ గ్రామంలో నిర్వహించిన రైతుసంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతుసంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగం రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేక వీరన్న, కె.భిక్షమయ్య, జనార్దన్, వెంకన్న, సత్యనారాయణ, నాగయ్య, వీరన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం..


మాట్లాడుతున్న ఈసం సుధాకర్

గూడూరు: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం రింగారిట్ గ్రామ ఆదివాసీలను టైగర్ జోన్ పేరిట అడవి నరికారని అక్రమంగా చేసిన అరెస్టులను ఖండిస్తున్నామని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బొల్లి సారయ్య అధ్యక్షతన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు టైగర్‌జోన్, అడవుల పెంపకం పేరిట అనాదిగా ఉన్నటువంటి ఆదివాసీ గ్రామాలను తరలించాలని కుట్ర పన్నుతున్నారన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పడిగ నాగేశ్వర్‌రావు, కొట్టెం ముఖర్జీ మంగయ్య, మల్లేష్, నాగేష్, సునీల్, రాజు, సురేష్, సురేందర్, ఎర్రయ్య పాల్గొన్నారు.

గిరిజన న్యాయవాదుల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా గిరిజన న్యాయవాదుల సమాఖ్య వ్యవస్థాపక సర్వసభ్య సమావేశం న్యాయవాది బాదావత్ చక్రవర్తి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా గిరిజన న్యాయవాదుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడిగా భూక్య మోహన్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బాలాజీనాయక్, కార్యదర్శిగా లాలునాయక్, కోశాధికారిగా మున్నాచౌహన్, సంయుక్త కార్యదర్శిగా భాస్కర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా గుశాల్, మహిళా న్యాయవాద సెక్రటరీగా సునీత ఎన్నికయ్యారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

కేసముద్రం: ఈత కొట్టేందుకు చెరువులో దిగిన ఓ యువకుడు నీటి మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని పెనుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన షేక్ ఇస్మాయిల్ (25) అనే యువకుడు సెంట్రింగ్ పనిచేసేందుకు, నాలుగు నెలల క్రితం తన తల్లిదండ్రులతో కలిసి, పెనుగొండ గ్రామానికి వచ్చాడు. ఇక్కడే ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ, ఆ కుటుంబం కూలీ పనులకు వెళ్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం చెరువులో శవమై తేలడంతో స్థానికులు గుర్తించారు. ఈమేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. చెరువు ఒడ్డున ఇస్మాయిల్ తన దుస్తువులు, చెప్పులు విప్పి చెరువులోకి దిగినట్లు గుర్తించారు. మృతుడి తండ్రి ఇమామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగున్నర కింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక, ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం రాత్రి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అనంతారం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా గ్రామ శివారులోని ఓ ప్రాంతంలో లభ్యమయిందని పేర్కొన్నారు. ఎండి.పాషా, నిజ్జు, వినయ్ పై కేసు నమోదు చేయగా పాషా తమ అదుపులో ఉన్నాడని నిజ్జు, వినయ్ పరారీలో ఉన్నారన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న ధ్వంసం



నెల్లికుదురు: రైతు సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికందే సమయంలో అడవి పందులు దాడి చేయగా ఎకరం మొక్కజొన్న పంట ధ్వంసం అయిన సంఘటన మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసకుంది. బుధవారం రైతు కోటగిరి గుంషావలి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధిలో నాలుగు ఎకరాలల్లో మొక్కజొన్న పంట సాగు చేసినట్లు తెలిపాడు రాత్రి అడవి పందులు దాడిచేసి ధ్వంసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు


మరిపెడ: గాయపడిన నరేందర్

మరిపెడ రూరల్: బొలెరో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాయ్యాయి. ఈసంఘటన మండల కేంద్రంలోని వరంగల్ -ఖమ్మం హైవేపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన నరేందర్, కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మండల కేంద్రంలోని మధ్య పెట్రోల్ బంక్‌లోకి క్రాస్ అవుతున్నారు. ఈ క్రమంలో ఓ బొలెరో వాహనం హైస్పీడ్‌తో వరంగల్ నుంచి ఖమ్మం వైపుగా వెళ్తున్న క్రాస్ అవుతున్న బైక్‌ను అదే స్పీడ్‌తో ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న నరేందర్, కుమార్‌లకు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరి తీవ్రగాయాలు


గార్ల: గాయపడిన శంకర్

గార్ల: ఎదురెదురుగా వెళ్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరి తలలకు తీవ్రగాయాలైన సంఘటన పూమ్యాతండా సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం పూమ్యాతండాకు చెందిన కవిత గార్ల నుంచి సరుకులు తీసుకొని బైక్‌పై వెళ్తుండగా, సేరిపురం పంచాయతీ దుబ్బతండాకు చెందిన అజ్మీర శంకర్ గార్లకు బైక్‌పై వస్తుండగా పూమ్యాతండా మలుపు వద్ద ఇరువురి బైక్‌లు ఢీకొన్నాయి. ఈఘటనలో తలలకు తీవ్ర గాయాలైన కవితను 108ద్వారా మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, శంకర్‌ను ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది రవికుమార్, ప్రశాంత్‌లు తెలిపారు. వీరిలో కవిత పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


దంతాలపల్లి: బీరిశెటిగూడెం పాఠశాలలో..


తొర్రూరు రూరల్: మడిపెల్లి స్కూల్‌లో..

ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థుకు పాఠశాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. - దంతాలపల్లి/తొర్రూరు రూరల్/నెల్లికుదురు


నెల్లికుదురు: శ్రీరామగిరి పాఠశాలలో..

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం..

తొర్రూరు రూరల్: నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎలాంటి కష్టం వచ్చిన అండగా ఉంటామని పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని వెంటాపురం, దత్రుతండల్లో ఇటీవల అనేక కారణాలతో మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి దయాకర్‌రావు పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం పని చేసే ప్రతి నాయకుడు, కార్యకర్తలను కంటికిరెప్పలాగా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు.

సంక్షిప్త సమాచారం

బాలికల భద్రత అందరి బాధ్యత

పెద్దవంగర: బాలికల భద్రత అందరి బాధ్యత అని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కళాధర్ అన్నారు. బుధవారం మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ కమిటీ సమావేశాన్ని పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్, సంతోష్, హరీష్, ఉపాధ్యాయులు గంగిశెట్టి రమేష్, రామ్మోహన్, రవి, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

కురవి: మండలంలోని సూదనపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన దాత జంపని శ్రీకాంత్ రూ.3వేలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం దారావత్ వెంకన్న, ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్‌కుమార్, ఎండి అంజద్‌పాషా, సారంగం, సరోజ, శుభ, ప్రగతి పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

నర్సింహులపేట: మండలంలోని ఫకీరతండా గ్రామంలో 29 మంది పేద కుటుంబాలకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఇంటర్నేషల్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో బుధవారం సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ మెరుగు సత్యనారాయణగౌడ్, మెరుగు భరత్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నర్సింహులపేట: మండల కేంద్రంలో ప్రగతి సేవా సమితి అధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ కిన్నెర యాకయ్య, ఎస్సై మాలోతు సురేష్, గద్దల జాన్, డాక్టర్ అన్వేష్ పాల్గొన్నారు.

సబ్సిడీని వినియోగించుకోవాలి

డోర్నకల్: లే అవుట్ రెగ్యులేషన్ స్కీం ద్వారా అర్హులైన వారు సబ్సిడీని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన లబ్దిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ విజయానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

తొర్రూరు రూరల్: మండలంలోని సోమారపుకుంటతండా ఆకేరువాగు సమీపంలో ఎండిపోతున్న వరిపంటలను బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఏఓ భాస్కర్ పరిశీలించారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



నర్సింహులపేట: మండలంలోని జయపురం గ్రామానికి చెందిన వంగాల చారిటబుల్ ట్రస్ట్ అధినేత వంగాల ప్రవీణ్ సుమారు రూ.లక్ష వ్యయంతో ఫ్రీజర్ బాక్స్‌ను బుధవారం గ్రామ పంచాయతీకి అందజేశారు. కార్యక్రమంలో మందుల యాకయ్య, జంపాల బిక్షం, వీరారెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, సురేష్, లింగారెడ్డి, జాఫర్, చెన్నారెడ్డి, బుచ్చిరెడ్డి, శేకర్ పాల్గొన్నారు.

పెళ్లి బంధంతో ఒక్కటైన మూగజంట

గార్ల: మాట్రిమోనీ ద్వారా మూగజంట ఒకరినొకరు ఇష్టపడి తల్లితండ్రులను ఒప్పించి బుధవారం గార్లలో సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు. గార్లకు చెందిన సంగు నాగరాజు ఉమ దంపతుల మూగ కుమారుడు అశ్విన్ సాయి, ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా బలుసుతిప్ప గ్రామానికి చెందిన సత్యనారాయణ రామోజీ దంపతుల మూగ కుమార్తె బుజ్జిలు మాట్రిమోనీ ద్వారా పరిచయమమై బుధవారం అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు.

డ్రిప్ నీటి పారుదలపై అవగాహన

దంతాలపల్లి: మండలంలోని దాట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బిందుసేద్యం (డ్రిప్) పారుదల పద్ధతులపై బుధవారం ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య పర్యవేక్షణలో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు రమేష్ విద్యార్థులకు వివరించారు.

కొమ్మలమ్మ జాతరకు తరలిన ముడుపు

కొత్తగూడ: మండలంలోని ఎంచగూడెంలో జరిగే కొమ్మలమ్మ జాతరకు గోపాలపురం గ్రామం నుంచి తలపతులు ముడుపును బుధవారం తరలించారు. హోలీ పర్వదినం రోజు ఆదివాసీ సంప్రదాయాలతో కొమ్మలమ్మ జాతర నిర్వహిస్తారు. జాతరకు వాసం వంశీయులు తలపతులుగా వ్యవహరించి అమ్మవారికి మొదటి ముడుపు చెల్లించడం ఆనవాయితీ.

ఆర్థికసాయం

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాలేరు నరహరి అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందాడు. గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు రూ.32 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష

కేసముద్రం: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్‌లు నిలిపివేయాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని జ్యోతిరావుపూలే సెంటర్‌లో బుధవారం రిలే నిరవధిక దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజు, గ్రామ అధ్యక్షుడు వల్లందాసు మహేష్, మామిళ్ల ప్రేమ్‌కుమార్, యాకయ్య పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవం



మహబూబాబాద్ రూరల్: వాసవి కపుల్స్ క్లబ్ మహబూబాబాద్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జిల్లా కేంద్రంలోని ఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మాలే యోగేశ్వరరావు, వైస్ గవర్నర్ రామ ఉపేందర్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా నాళ్ల వేణుగోపాల్, సెక్రటరీగా జంగాల విజయ్ కుమార్, ట్రెజరర్‌గా వనమాల సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

మల్యాల కేవీకేను సందర్శించిన విద్యార్థులు



కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కు చెందిన 8,9వ తరగతి విద్యార్థులు బుధవారం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈమేరకు విద్యార్థులు పంటక్షేత్రాలను, హార్టికల్చర్ సెంటర్, పలురకాల మొక్కలను, వ్యవసాయ పరికరాలను పరిశీలిస్తూ, శాస్త్రవేత్తలను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, శాస్త్రవేత్తలు డాక్టర్ మాలతి, క్రాంతికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.